# అర్థంకాని విషయం

"ఏమిటిరా! పొద్దుట్నుంచి అదోలా ఉన్నావు?" అన్నాడు రవి, విష్ణు మొఖంలోకి చూస్తూ.

"ఏంలేదు" అన్నాడు విష్ణువర్ధన్ బాబు.

ఏంలేదన్నప్పటికీ ఏదో తప్పకుండా ఉందనుకొన్నాడు రవివర్ధన్ రావు.

* * *

విష్ణువర్ధన్ బాబు కొత్తగా ఫస్ట్ ఫారంలో చేరినప్పుడు వచ్చి తన ప్రక్కనే కూర్చున్నాడు. రవిదీ, విష్ణుదీ యిద్దరిదీ ఒకే వయసు. ఒకే క్లాసు. ఇద్దరికీ మంచి స్నేహం కలిసింది. ఎవరు, ఎవర్ని ముందు మాట్లాడించేరో, ఎవరికీ తెలియదు, కాని, వాళ్ళుమాత్రం ఒకర్ని విడిచి, ఒకరు ఎప్పుడూ ఉండేవారు కాదు. విష్ణు స్కూలికి రాకపోతే రవి రాడు. రవి రాకపోతే విష్ణు రాడు. చదువులో మాత్రం ఫస్ట్ మార్కులెప్పుడూ రవివే. విష్ణు సెకండు. ఎప్పుడూ వీళ్ళకే ఫస్టు, సెకండు మార్కులు రావడంమూలంగా మిగిలినవాళ్ళకి ఉక్రోషంగా ఉండేది. అయినా వీళ్ళిద్దరూ కలిస్తే వాళ్ళో లెఖ్ఖా? విష్ణు తమాషాగా "నేను డాక్టరు నవుతాను. నువ్వు కంపౌండరుగా ఉండు." అంటే, రవి నవ్వుతూ, "నేను ప్లీడరు నవుతాను. నువ్వు గుమాస్తాగా ఉండు." అనేవాడు.

ఎక్కడి కెళ్ళినా ఇద్దరూ కలిసి వెళ్ళవలసిందే. వాళ్ళ ఇంగ్లీషు మేష్టారు వీళ్ళకి తమాషాగా 'మిత్రద్వయం' అని పేరుకూడా పెట్టారు. ఇద్దరూ అలా కలిసి చదువుకుంటూనే నెహ్రూ అంత పెద్దవాళ్ళయిపోవాలని గాంధీ అంత గొప్పవాళ్ళయిపోవాలని.......... ఇంకా ఇంకా ఏవేవో ఐపోవాలనీ అనుకొనేవారు. కాని హైస్కూల్లో

## నిడదవోలు మాలతి

ప్రవేశించి హైయర్ ఫారంలో కాలుపెట్టకుండానే విఘాతం వస్తుందని విష్ణు ఎప్పుడూ అనుకోలేదు. ఆమాటకొస్తే రవి మాత్రం అనుకున్నాడేమిటి, విష్ణునాన్నగారికి ట్రాన్స్ఫర్ అనేది ఒకటి ఉంటుందని, అది తమను విడదీస్తుందనీ!

* * *

"పోనీ, ఇంకొన్నాళ్ళు ఇక్కడే ఉంటానని మీ నాన్నగారు పై ఆఫీసరుకి ఉత్తరం రాస్తే?" అన్నాడు రవి, సాలోచనగా.

"ఊహుఁ. లాభం లేదు రా. మూడేళ్ళకంటె ఎక్కడా ఉండనివ్వరు."

ఒక నిముషం ఎవరూ మాట్లాడలేదు.

"మా అమ్మనడిగి నేనూ ఈ ఊళ్ళోనే ఉండిపోనా?" అన్నాడు విష్ణు ప్రశ్నార్థకంగా చూస్తూ.

"మీ ఇంట్లోనే ఉండిపోతాను. హాయిగా ఇద్దరం కలిసి చదువుకోవచ్చు."

గాలిలో తేలిపోతున్నట్టు మాట్లాడుతున్నాడు విష్ణు.

రవి ఆ మాటలకి ఆశ్చర్యపోలేదు. ఆలోచనల్లో పడ్డాడు. "ఉండు" అంటే ఉండిపోతాడు కాని వాడెక్కడ? తనెక్కడ? తన ఇంట్లో కుర్చీ కాదు కదా, ఓ స్టూలైనా లేదు. వాళ్ళింటినిండా సోఫాలే. వాళ్ళింట్లో మహాదర్జాగా ఉంటుంది. వాడికి వాళ్ళింట్లో జరిగిన దర్జాల్లో సగంకూడా తన యింట్లో జరగవు. అయినా ఉండమంటే ఉండిపోతాడు. కాని......

"శలవుల్లో మళ్ళీ ఈ ఊరొస్తావుగా?" అన్నాడు రవి.

* * *

మర్నాడు రవి స్టేషన్ కెళ్ళొచ్చాడు. వాడి స్థితికి జాలిపడ్డ తల్లి ఓదార్పుగా అంది, "ఊరికే అలా ఇదైపోతావెందుకు; నీకోసం వాళ్ళు ఉండిపోతారేమిటి? ఆ డాక్టరు వెళ్ళిపోతే ఇంకో డాక్టరు వస్తారు." అంది. రవికి అమ్మమాటలు నచ్చలేదు. ఆయన వెళ్ళిపోతే ఇంకోళ్ళు వస్తారు. నిజమే కాని ఇంకో 'విష్ణు' రావొద్దూ? ప్రపంచంలోని

అందరూ ఒక్క 'విష్ణు'కి సాటి రారనుకున్నాడు రవి. విష్ణు వాళ్లమ్మ ఎంతమంచిది? వాళ్లమ్మని తల్చుకునేసరికి కళ్లనీళ్లు తిరిగేయి రవికి. తను బీదవాడైనా వాళ్ల విష్ణుతో సమానంగా చూసేది. రసగుల్లాలు, జిలేబీలు, బాదంహల్వా...ఎన్నో ఇచ్చేది. ఇంతెందుకు. ఓమాటు విష్ణు పుట్టినరోజు వస్తే వాడితో పాటు తనకి కూడా ఓ లాల్చీ, నిక్కరు కొనియిచ్చింది. ఆవిడ ఎప్పుడూ సుఖంగా ఉండాలని తనకి తెలిసిన దేవుళ్లని మనసులో ప్రార్థించాడు. మరి కొత్త డాక్టరుగారి భార్యకూడా అలాటి దానో కాదో? వాళ్లింట్లో కూడా ఓ విష్ణు వున్నాడో లేడో? ఉన్నా ఆ కొత్తకుర్రాడు తన స్నేహితుడు ఎలా అవుతాడు? అమ్మకసలు ఏం తెలియదనుకున్నాడు రవి.

సాయంత్రం శ్రీధర్ వచ్చాడు. శ్రీధర్ తనకంటె వయసులో రెండేళ్లు పెద్ద. క్లాసులో ఒక ఏడు చిన్న. క్లాసులో అంతా వాడ్ని "ఆలిండియా రేడియో" అంటారు. ఎలా తెలుస్తాయో కాని, వాడికి తెలియని సంగతి అంటూ వుండదు. సోషల్ మేష్టారు కూడా, "పత్రికా విలేఖరిగా ఉంటే బాగా పనికొస్తావురా" అనేవారు. అయినా వీడు రవికిమాత్రం ముఖ్య స్నేహితుల్లో ఒకడు.

"ఏంరా? అలాగున్నావు?" తెలిసీ, తెలియనట్టు అడిగేడు శ్రీధర్.

"ఏంలేద"న్నాడు రవి. కాని కడుపులో దుఃఖం దాచుకోలేకపోయాడు. జరిగిందంతా చెప్పాడు. అంతా విని, "సొంతడబ్బా బాగా వాయించుకుంటాడు" అన్నాడు.

రవికి పట్టరాని కోపం వచ్చింది.

"నీకోసం వాళ్లమ్మా, నాన్నగారిని నూరుమైళ్లదూరంలో వదిలేసి ఇక్కడుంటాడేమిటి? అయినా ఉండమన లేకపోయావ్ తెలిసేది బలం. అన్నీ డాబులు".

"ముయ్యరా. నోరు." ఘాటిగా అరిచాడు రవి.

"రేపు జవాన్లని మాట్లాడదాంలే" అన్నాడు వెక్కిరింపుగా శ్రీధర్.

ఐదునిమిషాలు ఎవరూమాట్లాడలేదు.

రవికి అక్కడుండడం యిష్టంలేదు.

"పోనీ నువ్వన్నట్టుగానే ఉండమన్నా ఉండడనుకుందాం. నేను వాడ్ని ఇక్కడుండి కష్టపడమంటానో, లేక అక్కడికే వాళ్లమ్మా, నాన్నగారితో వెళ్లి హాయిగా ఉండమంటానో అని వాడే నన్ను పరీక్షించడానికి అడిగాడని ఎందుకనుకోకూడదు? అసలువాడెలాంటివాడో నాకు తెలుసు. వాడు చాలామంచివాడు. నీగుణాన్ని నువ్వుకనబర్చుకున్నావ్ అంతే!" అంటూ రవి అక్కడినుంచి లేచి వెళ్లిపోయాడు.

పన్నెండేళ్ల రవి వేసిన ప్రశ్న ఆరాత్రంతా ఎంత తన్నుకున్నా శ్రీధర్‌కి నిద్రపట్టకుండా చేసింది. అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ శ్రీధర్‌కి విష్ణువర్ధన్ బాబు, రవివర్ధన్ రావునే పరీక్షించాడో, రవివర్ధన్ రావే విష్ణువర్ధన్ బాబుని పరీక్షించాడో అర్థం కాలేదు. ★

## సైకిల్ వేదాంతం

ముతికి భాగీరావు

అనగనగా ఒకవూళ్లో ఒకడుండేవాడు. అతడికి ఒక సైకిల్ వుండేది. ప్రతిరోజూ అతడు సైకిలు మీదనే తిరుగుతుండేవాడు. ఒకనాడు అతడు ఒక షాపుకి వెళ్లాడు. సైకిలు వాకిట్లో నిలబెట్టి, షాపులోకి వెళ్లి, వస్తువులు కొని, ఆ వస్తువులన్నీ ఒకబండిలో వేసి తనూ ఆబండీలో ఎక్కి తిన్నగా ఇంటికి వెళ్లాడు.

ఇంటికి వెళ్లాక అతని భార్య "ఏమండీ, మీ సైకిలు ఏదీ?" అని అడిగింది. వెంటనే ఆషాపుదగ్గిరికి పరుగెత్తుకెళ్లి చూశాడు. సైకిలు అక్కడే వుంది. సైకిలు దొరికినందుకు సంతోషించి, దేముడికి ధన్యవాదాలు అర్పించటంకోసం అతడు త్రోవలో వున్న గుడికి వెళ్లాడు. గుడిలోనికి వెళ్లేముందు తన సైకిల్ని గుడిద్వారందగ్గర వుంచి, లోనికి వెళ్లాడు. గుడిలో, "హే! దైవమా! నీకు నామీద ఎంత దయ! షాపుదగ్గర మరచిపోయిన సైకిల్ను పోకుండా నీవేకదా కాపాడేవు! నీకు యివే పదివేలదండాలు" అని ఒక కొబ్బరికాయ కొట్టాడు. ప్రసాదం పుచ్చుకొని, గుడిబయటికి వచ్చాడు. తన సైకిలు అక్కడలేదు! కళ్లంట నీళ్లు గార్చుకుంటూ దేముడ్ని నిందిస్తూ ఇంటికి వెళ్లిపోయాడు. ★